అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

● రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో నాగారం, దమ్మాయిగూడ, కీసరలో భారీగా ఇండ్ల కూల్చివేత

మేడ్చల్ కలెక్టరేట్/కీసర, జనవరి 5 : నియోజక వర్గంలో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారులు ఉక్కుపాదం మోపారు. నాగారం, దమ్మాయిగూడల్లో శుక్రవారం భారీగా అక్రమ నిర్మాణాలను కూల్చివేయించారు. తాసీల్దార్ అశోక్ ఆధ్వర్యంలో పోలీసుల సహకారంతో నాగారం రెవెన్యూ పరిధిలోని 83 సర్వే నెంబర్ ప్రభుత్వ భూమిలో వెలిసిన 15 ఇండ్లను నేలమట్టం చేశారు. అదేవిధంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీ కుందన్‌పల్లి రెవెన్యూ పరిధిలోని 152, 153 సర్వే నెంబర్లలోని 17 ఇండ్లను కూల్చివేశారు. ఈ సందర్భంగా తాసీల్దార్ అశోక్ మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఐ కిశోర్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కీసర మండలంలో 15 ఇండ్లు..

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని కీసర తాసీల్దార్ అశోక్ కుమార్ హెచ్చరించారు. మండలంలోని చీర్యాల్ గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 224లో అక్రమంగా నిర్మించిన 15 ఇండ్లను రెవెన్యూ అధికారులు శుక్రవారం జేసీబీతో కూల్చివేయించారు. ప్రభుత్వ భూమిలో ఎవరైనా అక్రమంగా నిర్మాణాలు చేపడితే సహించేది లేదన్నారు.

చీర్యాల్‌లో అక్రమ నిర్మాణాలను జేసీబీతో కూల్చివేయిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఒగ్గు పూజారుల సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

ఘట్‌కేసర్ ఘట్‌మైసమ్మ ఆలయం వద్ద నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఒగ్గు పూజారుల సంఘం ప్రతినిధులు

ఘట్‌కేసర్, జనవరి 5 : మేడ్చల్ జిల్లా ఒగ్గు పూజారుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను శుక్రవారం ఆ సంఘం ప్రతినిధులు ఘట్‌కేసర్‌లోని మైసమ్మగుట్ట ఆలయం వద్ద ఆవిష్కరించారు. అనంతరం ఘట్‌మైసమ్మ దేవతకు బోనం, ఒడిబియ్యం సమర్పించారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ పాత మండల ఒగ్గు కళాకారుల సంఘం అధ్యక్షుడు చిలకల నర్సింహ, రాష్ట్ర సంఘం అధ్యక్షుడు కె.నర్సింగ్‌రావు, ఒగ్గు బాబు, బీర్ల జంగయ్య, భిక్షపతి,నాగరాజు, శ్రీనివాస్, నరేశ్,రవి, నర్సింహ్మ, యాదయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని శుక్రవారం సీపీఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, నాయకులు తాసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ సునీతకు వినతిపత్రం అందజేశారు. – బోడుప్పల్, జనవరి 5

సీఐటీయూలో చేరిక



క్యాబ్ డ్రైవర్లకు కండువా కప్పి సీఐటీయూలోకి ఆహ్వానిస్తున్న ఆ సంఘం జిల్లా నాయకులు చింతల యాదయ్య, ఎన్.సబిత

ఘట్‌కేసర్, జనవరి 5 : సుమారు వంద మంది క్యాబ్ డ్రైవర్లు శుక్రవారం సీఐటీయూలో చేరారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఘట్‌మైసమ్మ ఆలయం వద్ద జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు చింతల యాద య్య, ఘట్‌కేసర్ మండల కార్యదర్శి నార్కెట్‌పల్లి సబిత ఆధ్వర్యంలో క్యాబ్ డ్రైవర్లు సీఐటీయూలో చేరారు. ఈ సందర్భంగా యాదయ్య, సబిత మాట్లాడుతూ ప్రభుత్వం క్యాబ్ డ్రైవర్లను కూడా గుర్తించి ఉబర్, ఓలా డ్రైవర్ల మాదిరిగా అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జి.బాపి రెడ్డి, ఘట్‌మైసమ్మ కార్ ఓనర్స్, డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ అధ్యక్షుడు రాములు, సమ్మయ్య, రుక్మారెడ్డి,నర్సింహ, శివారెడ్డి, శ్రీధర్, కృష్ణగౌడ్, కె.ప్రకాశ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు సరిపడా మిషన్ భగీరథ నీరందించాలి

ఘట్‌కేసర్‌లో మిషన్ భగీరథ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5 : మిషన్ భగీరథ నీటిని గ్రామపంచాయతీలకు సరిపడా అందించాలని ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. మండలంలోని పంచాయతీలకు సరిపడా మిషన్ భగీరథ నీరందక స్థానిక బోర్ల నీటిని కలిపి సరఫరా చేస్తున్నారని, దీంతో ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. స్వచ్ఛమైన నీరందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఈలు మహేందర్, అర్చన, ఏఈలు హరిణి, శామ్యూల్, పంచాయతీరాజ్ ఏఈ వెంకటరెడ్డి, ఆరోగ్య కార్యకర్త పిట్టల శ్రీశైలం, రైతు సహకార సంఘం డైరెక్టర్ ధర్మారెడ్డి, సీనియర్ అసిస్టెంట్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా రాణించేందుకు శ్రమించాలి

కొర్రెముల జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో అనురాగ్ యూనివర్శిటీ ఫ్యాకల్టీ

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 5 : ప్రతి విద్యార్థి ఉన్నతంగా రాణించేందుకు శ్రమించాలని అనురాగ్ యూనివర్శిటీ సీఐఎస్ ఫ్యాకల్టీ డాక్టర్ ఎం తృప్తి తెలిపారు. మండలంలోని కొర్రెముల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్ఎస్ఎస్ సెల్ యూనిట్-3 సహకారంతో ఐఈఈఈ సీఐఎస్ చాప్టర్ ద్వారా కమ్యూనిటీ ఔట్‌రీచ్‌లో భాగంగా విద్యార్థులకు కేరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. 10వ తరగతి విద్యార్థులకు ఉన్నత విద్య ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్-3 ప్రోగ్రామ్ అధికారి మధుకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మి, ఇన్‌చార్జి వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రామమందిరం అక్షింతలు పంపిణీ

రాఘవేంద్రనగర్‌లో అక్షింతలను పంపిణీ చేస్తున్న సభ్యులు

మేడ్చల్/ మేడ్చల్ రూరల్, జనవరి 5 : మేడ్చల్ రాఘవేంద్రనగర్ కాలనీలో మాధవశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం అయోధ్య రామ మందిర అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు భద్రారెడ్డి, ప్రేమ్‌దాస్, సాయి కుమార్, ప్రవీణ్, మురళి, రాంబాబు, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

నూతన్‌కల్‌లో అక్షింతలు పంపిణీ చేస్తున్న సభ్యులు

అదేవిధంగా మేడ్చల్ మండలంలోని శ్రీరంగవరం, నూతన్‌కల్ గ్రామాల్లో శుక్రవారం శ్రీరామ క్షేత్ర ట్రస్ట్ ఆధ్వర్యంలో సభ్యులు అయోధ్య అక్షింతలను పంపిణీ చేశారు. శ్రీరంగవరంలో శ్రీరామ హనుమాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, నూతన్‌కల్‌లో పీఏసీఎస్ చైర్మన్ సురేశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పోచయ్య, నాయకులు, అశోక్‌గౌడ్, కృష్ణ, ట్రస్ట్ సభ్యులు ప్రవీణ్, వెంకట్, ప్రదీప్‌గౌడ్, శ్రీశైలం ముదిరాజ్, నరేశ్ ముదిరాజ్, తదితరులు అక్షింతలను పంపిణీ చేశారు.

నల్సార్‌లో మూడు రోజుల జాతీయ సదస్సు ప్రారంభం

నల్సార్ యూనివర్సిటీలో జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు, నిర్వాహకులు

శామీర్‌పేట, జనవరి 5: నల్సార్ యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ సదస్సును లా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సీసీజీఆర్‌టీ చైర్మన్ సీఎస్ ఆర్.వెంకటరమణ అన్నారు. శామీర్‌పేటలోని నల్సార్ లా యూనివర్సిటీలో నల్సార్ లా యూనివర్సిటీ ఆఫ్ లా సెంటర్ ఫర్ కార్పొరేట్ అండ్ కాంపిటీషన్ లాస్ మరియు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా(ఐసీఎస్ఐ), సెంటర్ ఫర్ కార్పొరేట్ గవర్నెన్స్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో శుక్రవారం కార్పొరేట్ లాస్ అండ్ గవర్నెన్స్‌లో 'డెవలప్‌మెంట్స్ అండ్ ట్రెండ్స్' అనే అంశంపై మూడు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు, భద్రతా చట్టాలు, సాంకేతిక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. 6, 7వ తేదీల్లోనూ సదస్సు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నల్సార్ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కృష్ణదేవరావు, ఎన్ఎల్‌యూ జోధపూర్ వీసీ ప్రొఫెసర్ హర్‌ప్రీత్‌కౌర్, అధ్యాపకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాపాలనకు 10,348 దరఖాస్తులు

మేడ్చల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్, జనవరి 5 : మేడ్చల్ నియోజకవర్గంలో అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో శుక్రవారం ప్రజాపాలన దరఖాస్తుల స్వీకరణ కొనసాగింది. ఆయా మున్సిపాలిటీల్లో కార్యక్రమాన్ని కమిషనర్లు పర్యవేక్షించారు. నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉండగా నాలుగింటిలో దరఖాస్తుల స్వీకరణ ముగిసింది. మేడ్చల్ మండలంలో మాత్రం కొనసాగింది. మేడ్చల్ మండలం రాజబొల్లారం తండాలో శుక్రవారం ప్రజాపాలన కార్యక్రమాన్ని తాసీల్దార్ శైలజ పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మంగ్యానాయక్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పొరేషన్లలో మొత్తం 10,053 దరఖాస్తులు రాగా మేడ్చల్ మరో 295 దరఖాస్తులు వచ్చాయి.

ఆర్టీసీ ఆత్మీయ వనభోజనాలు

శామీర్‌పేట బస్టాండ్ ప్రాంగణంలో భోజనాలు చేస్తున్న ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది

శామీర్‌పేట, జనవరి 5 : కలిసి ఉన్నప్పుడే ఎంతటి విజయమైనా సాధ్యమవుతుందని హకీంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ భవభూతి అన్నారు. ఆర్టీసీ యాజమాన్యం ఆదేశాల మేరకు రెండు రోజుల వన భోజన కార్యక్రమాన్ని శుక్రవారం శామీర్‌పేట బస్టాండ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కలిసి వన భోజనాలు చేయడంతో ఆంతరాలు తొలగి సంస్థ పటిష్టతకు దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో హకీంపేట ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్, ఫోర్‌మెన్ అచార్య, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.

బబ్బుగూడలో ఉచిత వైద్యశిబిరం

మూసాపేట, జనవరి5: డివిజన్ పరిధిలోని బబ్బుగూడలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు. మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్, తిరుపతి, బస్తీ అధ్యక్షుడు మజీద్‌ఖాన్, బోడ శ్రీనివాస్, రాములు, అరుల్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.